సాక్షి
జోగులాంబ గద్వాల
శనివారం । 11 । నవంబర్ । 2023



హ్యాండ్‌బాల్ టోర్నీ ప్రారంభం

మహబూబ్‌నగర్‌లో శుక్రవారం రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ ప్రారంభమైంది.

వివరాలు IIలో ▸



నగదు పట్టివేత

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో భారీగా నగదు పట్టుబడుతుంది.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /20.9

వాతావరణం

రోజంతా సాధారణంగానే ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశాన్ని మేఘాలు దట్టంగా కమ్ముకుంటాయి. రాత్రి చలి పెరుగుతుంది.

275 మంది.. 479 సెట్లు

ముగిసిన నామినేషన్ల పర్వం



గద్వాలలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- చివరి రోజు 217 నామినేషన్ల దాఖలు
- పోటాపోటీగా బరిలోకి స్వతంత్రులు
- ఆఖరి రోజు దేవరద్ర, అలంపూర్ బీజేపీ అభ్యర్థిత్వాలు ఖరారు
- బీఫారాలతో హడావుడిగా ఆర్వో కేంద్రాలకు పరుగులు
- ఈనెల 13న పరిశీలన, 15న తుది జాబితా విడుదల
- ఇక హోరెత్తనున్న ఎన్నికల ప్రచారం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్ /సాక్షి, నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కీలక ఘట్టం ముగిసింది. ఈనెల 3 నుంచి 10 వరకు ఎన్నికల నామినేషన్లను స్వీకరించగా ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థుల నుంచి భారీసంఖ్యలో నామినేషన్లు వెల్లువెత్తాయి. శుక్రవారం చివరిరోజు కావడంతో రాజకీయ పార్టీల అభ్యర్థులు బీఫారాలతో హుటాహుటిన నామినేషన్లు వేసే రిటర్నింగ్ అధికారి కేంద్రాలకు వచ్చి నామినేషన్లు వేశారు. షాద్‌నగర్ మినహా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కొడంగల్‌తో సహా 13 నియోజకవర్గాల్లో మొత్తంగా 275 మంది అభ్యర్థులు.. 479 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో చివరి రోజే 217 నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా..మహబూబ్‌నగర్ నియోజకవర్గ స్థానంలో అత్యధికంగా 31 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, నారాయణపేట నియోజకవర్గంలో అత్యల్పంగా 10 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో అత్యధికంగా 52 సెట్ల నామినేషన్ పత్రాలను అందజేయగా, నారాయణపేటలో కనిష్టంగా 19 సెట్ల నామినేషన్లు వచ్చాయి. ఈనెల 13న నామినేషన్ల పరిశీలన చేపట్టనుండగా, అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 15 వరకు గడువు ఉంటుంది. నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడం... పోలింగ్‌కు మరో 19 రోజులే ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం హోరెత్తనుంది.

మహబూబ్‌నగర్ జిల్లా

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో చివరిరోజు శుక్రవారం 14 నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేయగా.. 13 మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ నియోజకవర్గంలో 31 మంది అభ్యర్థులు 43 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. దేవరకద్ర నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తరఫున ఆయన కుమార్తె ప్రీతి, బీజేపీ అభ్యర్థి కొండా ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 16 మంది అభ్యర్థులు 28 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. జడ్చర్ల నియోజకవర్గంలో 19 మంది అభ్యర్థులు 37 సెట్ల నామినేషన్లు వేశారు. చివరి రోజు కాంగ్రెస్ అభ్యర్థి అనిరుద్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి శివకుమార్‌తో పాటు మరో 14మంది నామినేషన్లు దాఖలు చేశారు.

గద్వాల జిల్లా

గద్వాల నియోజకవర్గంలో చివరి రోజు 20 మంది 32 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి సరిత, బీజేపీ అభ్యర్థి బోయ శివారెడ్డి, బీఎస్పీ అభ్యర్థి అతికూర్ రెహమాన్ ఉన్నారు. మొత్తం 25 మంది అభ్యర్థులు 38 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. అలంపూర్ నియోజకవర్గంలో చివరిరోజు 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు, కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్, బీజేపీ నుంచి పెరుమాళ్ల గోపాల్, బీఎస్పీ నుంచి ఆర్‌ఎస్ ప్రసన్నకుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 25 మంది 47సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.



అలంపూర్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ కుమార్



గద్వాలలో నామినేషన్ పత్రం అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి బోయ శివారెడ్డి

వనపర్తి జిల్లా

వనపర్తి నియోజకవర్గంలో 19 మంది అభ్యర్థులు 39 సెట్ల నామినేషన్లు వేశారు. చివరిరోజు 15 నామినేషన్లు దాఖలు కాగా.. కాంగ్రెస్ అభ్యర్థి మేఘారెడ్డి, బీజేపీ నుంచి అనుజ్ఞరెడ్డి, అదే పార్టీ నుంచి చంద్రయ్య, బీఎస్పీ నుంచి మండ్ల మైబూస్, చెన్నరాములు నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నిరంజన్‌రెడ్డి తరఫున మరో నామినేషన్ దాఖలైంది. వీరితో పాటు 9 మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించారు.

నారాయణపేట జిల్లా

నారాయణపేట నియోజకవర్గంలో చివరి రోజు 6 నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ పర్నికారెడ్డి, బీఎస్పీ నుంచి శ్రీనివాసులు నామినేషన్ వేశారు. మొత్తం పది మంది అభ్యర్థులు 19 సెట్ల నామినేషన్లను సమర్పించారు. మక్తల్ నియోజకవర్గంలో చివరిరోజు 22 నామినేషన్లు వేయగా.. బీఆర్‌ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి, బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డి, సీపీఐ నుంచి కొండన్న నామినేషన్లు వేశారు. మరో 10 మంది ఇండిపెండెంట్లుగా నామినేషన్ వేశారు. మొత్తం 15 మంది అభ్యర్థులు 30 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. కొడంగల్‌లో బీజేపీ అభ్యర్థి బంటు రమేశ్, బీఎస్పీ అభ్యర్థి నర్మద శుక్రవారం నామినేషన్లు వేశారు. నియోజకవర్గంలో మొత్తం 16 మంది అభ్యర్థులు 26 సెట్లను దాఖలు చేశారు.

నాగర్‌కర్నూల్ జిల్లా


నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో శుక్రవారం 22 మంది నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ నుంచి బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కొండా మణెమ్మ, జనసేన నుంచి వంగా లక్ష్మణ్‌గౌడ్, నామినేషన్లు వేయగా.. మొత్తం 30 మంది అభ్యర్థులు 47 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో శుక్రవారం 31 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి ఆచారి నామినేషన్ వేయగా, ఆయనకు మద్దతుగా కేంద్ర మంత్రి భగవత్ కుబా వెంట వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి తరఫున ఆయన భార్య మాధవి, మరో మద్దతుదారుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ తరఫున ఒకరు, బీఎస్పీ అభ్యర్థి కొమ్ము శ్రీనివాస్ యాదవ్ నామినేషన్లను వేశారు. మొత్తం 28 మంది 52సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలో చివరిరోజు బీఆర్‌ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు, కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ, బీజేపీ అభ్యర్థి సతీశ్ మాదిగ, బీఎస్పీ అభ్యర్థి నాగార్జున నామినేషన్లు వేశారు. శుక్రవారం14 నామినేషన్లు రాగా, మొత్తం 19 మంది అభ్యర్థులు 35 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేయగా...శుక్రవారం 12 నామినేషన్లు రాగా.. మొత్తం 21 మంది అభ్యర్థులు 38సెట్లు దాఖలు చేశారు.

నియోజకవర్గాల వారీగా దాఖలైన నామినేషన్ల వివరాలిలా..

నియోజకవర్గం	చివరి రోజు నామినేషన్లు	మొత్తం అభ్యర్థులు	మొత్తం సెట్లు
మహబూబ్‌నగర్	14	31	43
దేవరకద్ర	13	16	28
జడ్చర్ల	16	20	37
నారాయణపేట	06	10	19
మక్తల్	22	15	30
వనపర్తి	15	19	39
గద్వాల	32	25	38
అలంపూర్	16	25	47
నాగర్‌కర్నూల్	22	30	47
కల్వకుర్తి	21	28	52
కొల్లాపూర్	14	21	38
అచ్చంపేట	14	19	35
కొడంగల్	12	16	26

నామినేషన్ల పరిశీలన	నామినేషన్ల ఉపసంహరణ గడువు	పోలింగ్
నవంబర్ 13	నవంబర్ 15	నవంబర్ 30

తోడు.. నీడగా



పతుల వెంట సతులు.. కొడుకు వెంట తల్లి

- గద్వాల, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేటలో డమ్మీ అభ్యర్థులుగా ఎమ్మెల్యే భార్యల నామినేషన్
- జడ్చర్లలో కుమారుడికి మద్దతుగా తల్లి సైతం..
- ఉమ్మడి పాలమూరులో 'వారసత్వ రాజకీయం'

గద్వాల రూరల్: గతంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే క్రమంలో సమర్పించే అఫిడవిట్‌లో సమగ్ర వివరాలు లేకుండా నామమాత్రంగా వివరాలు సమర్పించేవారు. అయితే టీఎన్ శేషన్ కేంద్ర ఎన్నికల అధికారిగా పనిచేసిన కాలం నుంచి ఎన్నికల సంఘం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యక్తిగత చరిత్రతో పాటు స్థిర, చర ఆస్తులు, ఇతరత్రా నేరపూరిత కేసులు, శిక్షలు వంటి వివరాలన్నీ కూడా సంపూర్ణంగా నామినేషన్ దాఖలు చేసే అఫిడవిట్‌లో పొందుపర్చాల్సి ఉంటుందని కఠినతరమైన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చారు. దీంతో అభ్యర్థులు ఏమాత్రం అసమగ్రంగా.. సత్యదూరమైన వివరాలను అఫిడవిట్‌లో పొందుపర్చితే అసలుకే ఎసరు వచ్చి ఏకంగా అనర్హత వేటుకు గురవుతారు. ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహాలో గెలుపొందిన పలువురు ప్రజాప్రతినిధుల అఫిడవిట్లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ప్రత్యర్థి పార్టీలు కోర్టులను ఆశ్రయించడం.. వాటిపై తీర్పులు వెలువడటం సంచలనంగా మారింది.

సమగ్రంగా.. సంపూర్ణంగా

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు గతంలో మాదిరి ఏది పడితే అది చెబుతాం అంటే కుదరదు. ఇక నుంచి సమగ్ర, సంపూర్ణ వివరాలు ఇవ్వాల్సిందే. లేకపోతే చిక్కుల్లో పడినట్టే. దీంతో చాలామంది ఎన్నికల్లో పోటీ చేసే ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులను డమ్మీలుగా నామినేషన్లు వేయిస్తున్నారు. పొరపాటుగా తమ నామినేషన్ తిరస్కరణకు గురైతే.. తమవారు పోటీలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో రాజకీయాలంటే నాయకత్వంపై నమ్మకంతో కొనసాగేవి. కానీ, కాలానుగుణంగా మారిన పరిస్థితుల నేపథ్యంలో రాజకీయాలు 'నమ్మితే.. ముంచితి' అన్న చందంగా మారాయి. దీంతో ఏళ్లపాటు తమ వెంటే ఉన్న అనుచరులు, శిష్యులను నమ్మడం కంటే తమ కుటుంబ సభ్యులపై నమ్మకం పెడుతున్నారు నేటితరం నాయకులు. ఇందుకు ఉదాహరణలే ఉమ్మడి పాలమూరు జిల్లాలో పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులు తమ భార్యలు, తల్లుల చేత డమ్మీ అభ్యర్థులుగా నామినేషన్ వేయించారు.

ఎక్కడెక్కడంటే..

- గద్వాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి పార్టీ టికెట్ కేటాయించింది. అయితే ఇటీవల ఆయనకు కోర్టు ద్వారా చిక్కులు ఎదురవడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ తరఫున తన భార్య బండ్ల జ్యోతితో రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయించారు. బండ్ల జ్యోతి గత ఎన్నికల్లో కూడా డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.
- జడ్చర్ల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అనిరుధ్‌రెడ్డికి టికెట్ కేటాయించగా నామినేషన్ వేశారు. అయితే అనిరుధ్‌రెడ్డి తల్లి శకుంతల కాంగ్రెస్ పార్టీ నుంచి డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.
- కొల్లాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి పార్టీ టికెట్ కేటాయించింది. ఈయన భార్య బీరం విజయ కూడా బీఆర్‌ఎస్ తరఫున రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.



నామినేషన్ వేస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి

- నాగర్‌కర్నూల్ సిట్టింగ్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ కేటాయించింది. ఈ క్రమంలో మర్రి భార్య జమున బీఆర్‌ఎస్ నుంచి డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.
- అచ్చంపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ వంశీకృష్ణకు టికెట్ కేటాయించింది. ఈయన భార్య డాక్టర్ అనురాధ సైతం పార్టీ తరఫున డమ్మీ అభ్యర్థిగా అచ్చంపేట నియోజకవర్గం నుంచి నామినేషన్ పత్రం దాఖలు చేశారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

గద్వాల రూరల్/ఎర్రవల్లిచౌరస్తా: జిల్లాలో సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల పోలీస్ పరిశీలకుడు, హిమాచల్‌ప్రదేశ్ డీఐజీ అనుపమ్ శర్మ సూచించారు. శుక్రవారం అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని జిల్లాకు చేరుకున్న ఆయనకు బీచుపల్లి పదో బెటాలియన్ గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రితిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికలు నిర్వహించడానికి ముందస్తుగా తీసుకుంటున్న చర్యలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, జిల్లా భౌగోళిక పరిస్థితులు, రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, ఇప్పటి వరకు జిల్లాలో పట్టుబడ్డ డబ్బు, మద్యం, కేంద్ర బలగాల వినియోగింపు, భద్రతా పరంగా తీసుకుంటున్న వివిధ చర్యలపై ఆయన కలెక్టర్, ఎస్పీలతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలను ప్రభావితం చేసే ఎలాంటి అనుమానాస్పదమైన అంశాలైనా తన దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



ఎన్నికల పరిశీలకుడు అనుపమ్‌శర్మతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రితిరాజ్

అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లో ఎక్కడైనా ఎన్నికల ప్రభావిత అంశాలు ప్రజలు, పార్టీల నాయకుల దృష్టికి వస్తే సెల్ నం. 6301754688 కు లేదా బీచుపల్లి పదో బెటాలియన్ గెస్ట్‌హౌస్‌లో ఉదయం గం.10-00 నుండి గం.11-00 వరకు నేరుగా సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చునని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కమాండెంట్ సాంబయ్య, సాయిధ దళ డీఎస్పీ ఇమ్మానియేల్, అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, తదితరులు ఉన్నారు.

బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల ఖరారు



అలంపూర్: అలంపూర్ అసెంబ్లీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా రాజగోపాల్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. నామినేషన్ల చివరి రోజు అభ్యర్థి పేరు ప్రకటించి బీఫాం ఇవ్వడంతో అలంపూర్ ఆర్‌ఓ కార్యాలయంలో తమ నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా బీఎస్పీ అభ్యర్థిగా ఆర్‌ఎస్ ప్రసన్నకుమార్‌ను పార్టీ అధిష్టానం ప్రకటించింది. నామినేషన్ సైతం దాఖలు చేశారు.

రాజగోపాల్ ప్రొఫైల్

పేరు : పెరుమాళ్ళ రాజగోపాల్
పుట్టిన తేదీ : 10-09-1959
తల్లిదండ్రులు : కిష్టన్న, నారాయణమ్మ
భార్య : క్రాంతిలక్ష్మి,
సంతానం : కూతుళ్లు సాయి సాహితీ, సాయిరచన, కుమారుడు సాయిశరత్
విద్యాభ్యాసం : ఎం కామ్,
స్వగ్రామం : అలంపూర్, రాజకీయ ప్రస్థానం : గత మూడేళ్లుగా జోగుళాంబ గద్వాల జిల్లా అధికార ప్రతినిధిగా కొనసాగుతుండటం.

ప్రసన్నకుమార్ ప్రొఫైల్

పేరు : రేపల్లె ప్రసన్నకుమార్
పుట్టిన తేదీ : 15-10-1972
తల్లిదండ్రులు : నవరన్న, ప్రేమమ్మ
భార్య : నవనీత
సంతానం : కుమార్తె రొహితి స్వర్ణ, కుమారుడు హితీష్ కుమార్
విద్యాభ్యాసం : ఎంవీఎస్సీ, పీహెచ్‌డీ, పశు పోషక న్యూట్రిషన్
స్వగ్రామం : సంతోష్ నగర్ కాలనీ, అలంపూర్



రాజకీయ ప్రస్థానం : 2009లో అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి బరిలో నిలిచారు.

చెరుకు కోతలు షురూ..

- మద్దతు ధర టన్నుకు రూ.3,340
- కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 7,500 ఎకరాలు
- సీజన్‌లో 2.30 లక్షల టన్నుల దిగుబడి అంచనా

అమరచింత: జిల్లాలోని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో మూడురోజులుగా చెరుకు కోతలు కొనసాగుతున్నాయి. కార్మికులు గ్రామాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకొని కోత పనుల్లో నిమగ్నమయ్యారు. సకాలంలో కోతలు ప్రారంభమయ్యాయని.. త్వరగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ సీజన్‌లో ఫ్యాక్టరీ పరిధిలో 7,500 ఎకరాల్లో చెరుకు సాగు చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం మద్దతు ధర టన్నుకు రూ.3,340 చెల్లిస్తుండటంతో సాటే రాయితీలు ఇస్తుండటంతో రైతులు ఈసారి చెరుకు సాగుకు సన్నద్ధమవుతున్నారు. పంట కోతలకు 180 మంది కార్మిక బృందాలు రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 75 బృందాలు వచ్చాయి. వీరితోపాటు ఫ్యాక్టరీకి చెందిన రెండు కోత యంత్రాలతో పాటు 5 ప్రైవేట్ కోత యంత్రాలను యాజమాన్యం సిద్ధం చేసింది.

ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి..

ఆంధ్రప్రదేశ్‌లోని ఎర్రగుంట పాలెం, కర్ణాటక, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి 75 కోత బృందాలు వచ్చాయి. ఒక్కో బృందంలో 20 నుంచి 25 మంది కార్మికులు ఉండగా.. టన్ను కోతకు రూ.800 నుంచి రూ.900 వరకు వసూలు చేస్తున్నారు. ఫ్యాక్టరీలో క్రషింగ్‌కు అదనపు కార్మికులు అవసరం ఉండటంతో మరో 85 బృందాలను త్వరలో రప్పించే ప్రయత్నంలో యాజమాన్యం ఉంది.



అమరచింత శివారులో చెరుకు కోతలు నిర్వహిస్తున్న కార్మికులు

రాయితీలతో ఆసక్తి..

ఫ్యాక్టరీ యాజమాన్యం ఈసారి చెరుకు సాగుచేసే రైతులకు రాయితీలు ఇస్తుండటంతో గతంలో పంటను వదులుకున్న వారు సైతం దృష్టి సారిస్తున్నారని ఫ్యాక్టరీ కేన్‌హెడ్ వెల్లడించారు. ఎకరానికి రెండు టన్నుల విత్తనంతో పాటు రాయితీ ఎరువులు ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గతంలో 6,500 ఎకరాలు ఉండగా.. ప్రస్తుతం అదనంగా మరో వెయ్యి ఎకరాల సాగు పెరిగిందని కంపెనీ యాజమాన్యం వెల్లడించారు. చెరుకు సాగు పెంచేందుకు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించడంతో పాటు శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించడంపై దృష్టి సారిస్తున్నామన్నారు.

సకాలంలో కోతలు పూర్తి చేయాలి..

గతంలో సకాలంలో చెరుకు కోతలు పూర్తిగాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈసారి అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా కోత కార్మికులను సకాలంలో రప్పించి అనుకున్న సమయానికి కోతలు పూర్తి చేయాలి.
– నారాయణ, సింగంపేట

రైతు ప్రయోజనాలే ముఖ్యం..

ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగుచేసిన రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సకాలంలో కోతలు పూర్తి చేయడానికి తగిన ప్రణాళికలే సిద్ధం చేసుకున్నాం. మద్దతు ధరతో పాటు సాగుకు రాయితీలు ఇస్తున్నాం. పంటను ఫ్యాక్టరీకి తరలించిన 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా అన్నిచర్యలు తీసుకుంటున్నాం.
– రామ్మోహన్‌రావు, కేన్‌హెడ్

న్యూస్‌రీల్

తుమ్మిళ్ల లిఫ్ట్‌తో ఆర్డీఎస్‌లో జలకళ



శాంతినగర్: తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆన్ చేయడంతో ఆర్డీఎస్ కెనాల్ జలకళను సంతరించుకుంది. తుంగభద్ర డ్యాంలో ఆర్డీఎస్ వాటాగా విడుదల చేసిన నీరు శుక్రవారం తుమ్మిళ్ల లిఫ్ట్ వద్దకు చేరుకున్నాయి. దీంతో అధికారులు లిఫ్ట్ మోటార్ ఆన్ చేయడంతో తుంగభద్ర నీరు ఆర్డీఎస్‌లో పరుగులు పెట్టింది.

ఫలించిన ఎమ్మెల్సీ కృషి..

ఆర్డీఎస్‌లో నీరులేక, వర్షాలు రాక పంటలు ఎండుతున్నాయని ఆర్డీఎస్ రైతులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్సీ చల్లా సీఎం కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఇరు రాష్ట్రాల సాగునీటి పారుదలశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఇండెంట్ పెట్టించారు. అంతేగాక ఇటాచీతో తుమ్మిళ్ల ఇంటెక్ వెల్ వద్ద అడ్డుగా ఉన్న రాళ్లు, షిల్ట్‌ను తొలగింపజేశారు. తెలంగాణ ఇండెంట్‌గా 1.5 టీఎంసీలు, కేసీ కెనాల్ ఇండెంట్‌గా టీఎంసీ నీటిని విడుదల చేయించారు. దీంతో తుమ్మిళ్ల వద్దకు శుక్రవారం ఉదయం నీరు చేరాయి. ఆర్డీఎస్ అధికారులు లిఫ్ట్ మోటార్ ఆన్ చేయడంతో శుక్రవారం సాయంత్రానికి డిస్ట్రిబ్యుటరీ–29 వరకు నీరు చేరుకున్నాయి.

జోగులాంబ సన్నిధిలో కొల్లాపూర్ ఎమ్మెల్యే



జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలో ఐదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను శుక్రవారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అర్చకులు వారికి తీర్థ, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు.

ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఉండవెల్లి: రానున్న ఎన్నికల్లో ప్రజలు భయపడకుండా ఇష్టం వచ్చిన వారికి ఓటు వేసుకోవాలని ఐటీబీపి జవాన్లు, కవాతు ద్వారా గ్రామస్తులకు సూచించారు. మండలంలోని శేరుపల్లె, ప్రాగటూరు, మారమునగాల–1,2 గ్రామాల్లో శుక్రవారం ఐటీబీపి జవాన్లు కవాతు నిర్వహించారు. ప్రధాన వీదుల్లో తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎవరైన అభ్యర్థులు, పార్టీలకు చెందిన నాయకులు దౌర్జన్యం చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయ్యాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తం సిబ్బంది 60 మంది కవాతులో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజు, ఎస్ఐ బాల్‌రాజు, పోలీస్ సిబ్బంది రాజశేఖర్, రవి కుమార్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పంట పరిశీలన

కేటిదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నెలో పంపిణీ చేసిన వేరుశనగ (కదిరి లేపాక్షి) మినీ కిట్స్ పంట పొలాలను గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, డైరెక్టర్ ఆఫ్ అయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ అధికారులు శ్రీనివాస్, పుష్పలత(టెక్నికల్ అసిస్టెంట్) పరిశీలించారు. రైతులు గోవిందనాయక్, పీర్యానాయక్ పొలాల్లో కొత్త ప్రయోగాలు చేశారు. మిగిలిన రకాలతో పోలిస్తే కదిరి లేపాక్షి అధిక దిగుబడి ఇస్తుందని రైతులు తెలిపారు. వెంకటలక్ష్మీ, సంగీత లక్ష్మీ, భవణి, తదితరులు ఉన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,270

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శుక్రవారం 1,147 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.7270, కనిష్టం రూ.3516, సరాసరి రూ.5800 ధరలు పలికాయి. అలాగే, 79 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్టం రూ.5369, కనిష్టం రూ.4876, సరాసరి రూ.5225 ధరలు వచ్చాయి. దీంతోపాటు 621 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.2269, కనిష్టం రూ. 2079, సరాసరి ధర రూ.2169 ధరలు పలికాయి. 20 క్వింటాళ్ళ వరి (హంస) రాగా, గరిష్టం, కనిష్టం, సరాసరి రూ. 2059 ధర వచ్చింది.



వేలకొద్దీ నీతులు బోధించే బదులు ఒక మంచి పని చేసి చూపించడం మేలు.
- మహాత్మాగాంధీ

దటీజ్... నాగన్న!

డాక్టర్ నాగన్న.. ఉమ్మడి జిల్లాలో పాతతరం రాజకీయ నాయకుల్లో ఈ పేరు తెలయనివారు ఉండరు. ఆయన రాజకీయాల్లో తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్నారు. ఆయన ఏ నియోజకవర్గం నుంచి పోరులో నిలిచినా విజయాన్ని దక్కించుకున్నారు. అలంపూర్ మండలం లింగనవాయి గ్రామానికి చెందిన డాక్టర్ నాగన్న 1952లో మొదటి సారి అలంపూర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. ఆ తర్వాత జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో అలంపూర్ స్థానాన్ని జనరల్‌కు కేటాయించారు. 1957లో కల్వకుర్తి నుంచి పోటీ చేసి విజయం దక్కించుకున్నారు. 1962 ఎన్నికల్లో అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన నాగన్న సీపీఎం అభ్యర్థి ఎస్.చలంపై 5,413 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 1967 షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. ఈ విధంగా ఆయన నాలుగు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు.



- మహబూబ్‌నగర్ డెస్క్

ప్రజాకాంక్షను నెరవేర్చలేదని నామినేషన్

ప్రజాకాంక్ష మేరకు కొత్త మండలం ఏర్పాటు చేయకపోవడాన్ని నిరసనస్తూ ఓ వ్యక్తి అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేశారు. కోయిల్‌కొండ మండలంలోని గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని సమీపంలోని 10 గ్రామాల ప్రజల మద్దతుతో 200 రోజులకు పైగా రిలే దీక్షలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని.. నారాయణపేట నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు గ్రామానికి చెందిన తూర్పు జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. – కోయిల్‌కొండ



అభ్యర్థుల ఆస్తులు - అప్పులు

శ్రీనివాస్‌గౌడ్
మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి



బీఆర్‌ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌కు అప్పులు రూ.44,776 ఉన్నాయి. చరాస్తులు రూ.1,14,15,781, స్థిరాస్తులు రూ.51,55,000, చేతిలో నగదు రూ.19,31,480 ఉండగా.. ఆయన సతీమణి శారద పేరుపై చరాస్తులు రూ.2,82,36,165, స్థిరాస్తులు రూ.2,42,43,085, నగదు రూ.53,743, అప్పులు రూ.3,02,72,101 ఉన్నాయి. 2018లో శ్రీనివాస్‌గౌడ్ చరాస్తులు రూ.71,94,203, స్థిరాస్తులు రూ.15,46,100 ఉన్నాయి. చేతిలో నగదు రూ.2,50,000 ఉండగా, అప్పులు లేవు. శారద పేరు మీద చరాస్తులు రూ.2,16,55,711, స్థిరాస్తి రూ.37,47,826లతో కొనుగోలు చేయగా.. స్థిరాస్తుల విలువ రూ.96,00,000, నగదు రూ.1,00,000 అప్పులు రూ.35,29,285 ఉన్నాయి.

ఎన్నికల నామినేషన్‌లో భాగంగా ఆయా పార్టీల అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్‌లలో తమ ఆస్తులు, అప్పులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల చేతిలో నగదు అంతంతమాత్రంగా ఉంది. కొందరు అభ్యర్థులతో సమానంగా వారి సతీమణుల పేరుపై చర, స్థిరాస్తులు ఉన్నాయి. కొల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు, బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావులకు స్వంత ఇల్లు లేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

లక్ష్మారెడ్డి
జడ్చర్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి



బీఆర్‌ఎస్ జడ్చర్ల అభ్యర్థి లక్ష్మారెడ్డికి రూ.2,54,20,385 విలువగల చరాస్తులు, రూ.4,58,43,750 విలువజేసే స్థిరాస్తులు ఉన్నాయి. చేతిలో నగదు రూ.2,50,000, బంగారం 1,041 గ్రాములు, వ్యవసాయ భూమి 20.20 ఎకరాలు ఉంది. రూ.1,03,62,926 అప్పులు ఉన్నాయి. లక్ష్మారెడ్డి సతీమణి శ్వేత పేరు మీద రూ.14,09,19,271 విలువజేసే చరాస్తులు ఉన్నాయి. రూ.11,40,00,000 విలువగల స్థిరాస్తులతో పాటు చేతిలో నగదు రూ.5లక్షలు, బంగారం 4,053 గ్రాములు, 12.37 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నాయి. రూ.14,09,19,271 అప్పులు ఉన్నాయి.

జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి
జడ్చర్ల కాంగ్రెస్ అభ్యర్థి



కాంగ్రెస్ జడ్చర్ల అభ్యర్థి జనుంపల్లి అనిరుధ్‌రెడ్డికి రూ.51,32,392 విలువజేసే చరాస్తులు, రూ.1,93,25,948 విలువగల స్థిరాస్తులు ఉన్నాయి. చేతిలో నగదు రూ.33,450 ఉండగా, అప్పులు రూ.9,96,29,800 ఉన్నాయి. 53 ఎకరాల వ్యవసాయ భూమి, ఉంది. 5 పోలీస్ కేసులు ఉన్నాయి. అతడి సతీమణి మంజూష పేరు మీద రూ.11,47,34,486 విలువగల చరాస్తులు, రూ.6,64,10,653 విలువజేసే స్థిరాస్తులు ఉన్నాయి. చేతిలో నగదు రూ.21,595, బంగారం 1,215 గ్రాములు 18ఎకరాల వ్యవసాయ భూమి ఉంది.

బీరం హర్షవర్ధన్‌రెడ్డి
కొల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి



బీఆర్‌ఎస్ కొల్లాపూర్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డికి రూ.5,75,00,000 విలువజేసే స్థిరాస్తులతోపాటు రూ.3,84,21,944 విలువైన చరాస్తులు ఉన్నాయి. చేతిలో నగదు రూ.2,00,000 ఉండగా, రూ.2,57,81,684 అప్పు ఉంది. మూడు కార్లు ఉన్నాయి. బంగారం 370 గ్రాములు, సింగోటం, ఎత్తం గ్రామాల్లో భూములు ఉన్నాయి.కొల్లాపూర్, బంజారాహిల్స్‌లో నివాసగృహాలు, వనపర్తిలో కమర్షియల్ భవనం ఉంది. ఆయన భార్య విజయ పేరు మీద రూ.1,72,000 విలువజేసే స్థిరాస్తులు, రూ.61,45,944 విలువగల చరాస్తులు ఉన్నాయి. చేతిలో నగదు రూ.1,40,000, బంగారం 650 గ్రాములు, రూ.47,98,339 అప్పు ఉంది.

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
గద్వాల బీఆర్‌ఎస్ అభ్యర్థి



బీఆర్‌ఎస్ గద్వాల అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిపై రెండు కేసులు ఉన్నాయి. చేతిలో నగదు రూ.2లక్షలు ఉండగా, రూ.4,11,56,750 విలువజేసే స్థిరాస్తులు, రూ.8,20,7464.43 విలువగల చరాస్తులు ఉన్నాయి. రూ.1,82,20,722 అప్పు ఉంది. ఆయన భార్య జ్యోతి చేతిలో రూ.2లక్షల నగదు ఉండగా, రూ.4,19,10,500 విలువజేసే స్థిరాస్తులు, రూ.49,48,855 విలువైన చరాస్తులు ఉన్నాయి. కుమారుడు సాకేత్‌రెడ్డి పేరుపై రూ.60వేల విలువైన స్థిరాస్తులతో పాటు రూ.60,904 విలువైన చరాస్తులు ఉన్నాయి.

యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి

కాంగ్రెస్ మహబూబ్‌నగర్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి రూ.1,18,42,292 విలువగల చరాస్తులు ఉన్నాయి. స్థిరాస్తులు రూ.1,48,00,000 విలువగలవి ఉండగా, చేతిలో నగదు రూ.2,00,000 ఉంది. రూ.24,69,314 అప్పులు ఉన్నాయి. ఆయన భార్య తూము ప్రసన్న పేరు మీద రూ.1,22,10,908 విలువైన చరాస్తులు ఉన్నాయి. రూ.9,31,000లతో స్థిరాస్తి కొనుగోలు చేశారు. స్థిరాస్తుల విలువ రూ.96,00,000లుగా ఉంది. చేతిలో నగదు రూ.1,50,000 ఉండగా, రూ.6,47,869 అప్పులు ఉన్నాయి.

నిరంజన్‌రెడ్డి
వనపర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి



బీఆర్‌ఎస్ వనపర్తి అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి 2018 ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో మొత్తం చర, స్థిరాస్తుల విలువ రూ.1.64కోట్లు కాగా.. 2023లో మొత్తం ఆస్తుల విలువ రూ. 5.10కోట్లకు చేరింది. రూ.1.08కోట్ల విలువజేసే చరాస్తులతో పాటు రూ.4.05 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. రూ.1.06 కోట్ల అప్పు ఉంది. ఆయన భార్య వాసంతి పేరుపై రూ. 2.85 కోట్ల విలువైన చర, స్థిరాస్తులు ఉన్నాయి.

చిత్తరంజన్‌దాస్
జడ్చర్ల బీజేపీ అభ్యర్థి

బీజేపీ జడ్చర్ల అభ్యర్థి చిత్తరంజన్‌దాస్‌కి రూ.22,97,516 విలువగల చరాస్తులు ఉన్నాయి. చేతిలో నగదు రూ.1,95,00తో పాటు బంగారం 70 గ్రాములు ఉంది. అతడి సతీమణి నీరజ పేరు మీద రూ.52,68,600 విలువగల స్థిరాస్తులతో పాటు చేతిలో నగదు రూ.1,15,000 ఉన్నాయి. బంగారం 700 గ్రాములు ఉండగా, రూ.8,26,500 అప్పు ఉంది.

జూపల్లి కృష్ణారావు
కొల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి

కాంగ్రెస్ కొల్లాపూర్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావుకు స్వంత ఇల్లు లేదు. చౌటబెట్ల శివారులో నూతనంగా ఇంటి నిర్మాణం సాగుతోంది. జూపల్లికి రూ.2,50,36,336 విలువగల స్థిరాస్తులతో పాటు రూ.29,70,049 చరాస్తులు ఉన్నాయి. చేతలో నగదు రూ.4,80,100 ఉండగా, రూ.1,50,00,000 అప్పు ఉంది. బంగారం 10 గ్రాములు, ఒక కారు ఉన్నాయి. చిన్నంబావి, పెద్దకొత్తపల్లి, సైబరాబాద్ పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయి. పెద్దదగడ, చౌటబెట్ల శివార్లలో భూములు ఉన్నాయి. ఆయన భార్య సృజన పేరు మీద స్థిరాస్తులు లేవు. రూ.38,82,786 విలువగల చరాస్తులతో పాటు చేతిలో నగదు రూ.52,540, బంగారం 450 గ్రాములు, వెండి 3.5 కేజీలు ఉంది.

ఎల్లేని సుధాకర్‌రావు
కొల్లాపూర్ బీజేపీ అభ్యర్థి

బీజేపీ కొల్లాపూర్ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావుకు స్వంత ఇల్లు లేదు. మహాసముద్రం, గగ్గలపల్లి, ఇబ్రహీంపట్నంలో భూములు ఉన్నాయి. పెద్దకొత్తపల్లి, చిన్నంబావి, పాన్‌గల్, కొల్లాపూర్, చైతన్యపురి, నాగర్‌కర్నూల్, శంషాబాద్ పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయి. రూ.1,19,20,000 విలువజేసే స్థిరాస్తులతో పాటు రూ.16,98,326 విలువజేసే చరాస్తులు ఉన్నాయి. చేతిలో నగదు రూ.1,00,000 ఉంది. ఆయన భార్య భారతి పేరు మీద రూ.1,64,40,000 విలువజేసే స్థిరాస్తులు ఉన్నాయి. రూ.4,16,29,464 విలువజేసే చరాస్తులతో పాటు చేతిలో నగదు: రూ.50,000, ఒక కారు, 70 తులాల బంగారం ఉంది.

ఎపి.మిథున్‌కుమార్‌రెడ్డి
మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి

బీజేపీ మహబూబ్‌నగర్ అభ్యర్థి ఎపి.మిథున్‌కుమార్‌రెడ్డికి చరాస్తులు లేవు. రూ.16,35,76,683 విలువజేసే స్థిరాస్తులు ఉన్నాయి. చేతిలో నగదు రూ.80,000 ఉండగా, రూ.38,78,000 అప్పులు ఉన్నాయి. మిథున్‌కుమార్‌రెడ్డి సతీమణి రిషిక పేరు మీద చరాస్తులు, స్థిరాస్తులు లేవు. చేతిలో రూ.95వేల నగదు మాత్రమే ఉంది.

చిక్కుడు వంశీకృష్ణ
అచ్చంపేట కాంగ్రెస్ అభ్యర్థి

కాంగ్రెస్ అచ్చంపేట అభ్యర్థి చిక్కుడు వంశీకృష్ణకు రూ.76,09,198 విలువజేసే చరాస్తులతో పాటు రూ.1,88,39,500 విలువగల స్థిరాస్తులు ఉన్నాయి. పూర్వికుల ఆస్తి రూ.18,39,500 ఉండగా, రూ.2,36,53,825 అప్పు ఉంది. ఆయన భార్య అనురాధ పేరు మీద రూ.72,59,608 విలువజేసే చరాస్తులతో పాటు రూ.2,23,05,625 విలువజేసే స్థిరాస్తులు ఉన్నాయి. పూర్వికుల ఆస్తి రూ.3,65,625 ఉండగా, రూ.2,12,33,502 అప్పు ఉంది. కుమారుడు యశ్వంత్ పేరుపై రూ.4,60,947 విలువైన చరాస్తులు ఉండగా, కూతురు యుక్తాముఖి పేరుపై రూ. 39,26,616 విలువజేసే చరాస్తులు ఉన్నాయి. రూ.2.75లక్షల అప్పు ఉంది.

చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
మక్తల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి

బీఆర్‌ఎస్ మక్తల్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి రూ.98,30,000 చరాస్తులతో పాటు రూ.57,35,000 విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. మూడు వాహనాలు ఉండగా, రూ.9లక్షల అప్పు ఉంది. ఆయన సతీమణి సుచరిత పేరు మీద రూ.కోటి 31లక్షల విలువైన చరాస్తులతో పాటు రూ.89లక్షల విలువజేసే స్థిరాస్తులు, రూ.6లక్షల అప్పు ఉంది. రెండు కార్లు ఉన్నాయి.

గువ్వల బాలరాజు
అచ్చంపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి

బీఆర్‌ఎస్ అచ్చంపేట అభ్యర్థి గువ్వల బాలరాజుకు రూ.2,70,54,162 విలువజేసే చరాస్తులతో పాటు రూ.7,20,17,187 విలువజేసే స్థిరాస్తులు ఉన్నాయి. అప్పు రూ.2,69,73,180 ఉంది. గువ్వల భార్య అమల పేరు మీద రూ.69,06,711 విలువజేసే చరాస్తులతో పాటు రూ.53,07,813 విలువగల స్థిరాస్తులు ఉన్నాయి. రూ.2,31,29,600 అప్పు ఉంది.

బోయ శివారెడ్డి
గద్వాల బీజేపీ అభ్యర్థి

బీజేపీ గద్వాల అభ్యర్థి బోయ శివారెడ్డిపై నాలుగు కేసులు ఉన్నాయి. రూ.22.50లక్షల విలువజేసే స్థిరాస్తులు ఉండగా, చేతిలో నగదు రూ.5లక్షలు ఉన్నాయి. రూ.90,386 అప్పు ఉంది. ఆయన భార్య జానకమ్మ పేరుపై రూ.23.41లక్షల విలువజేసే స్థిరాస్తులతో పాటు రూ.5లక్షల నగదు ఉంది.

సరిత- గద్వాల కాంగ్రెస్ అభ్యర్థి

కాంగ్రెస్ గద్వాల అభ్యర్థి సరితకు రూ.45,45,487 విలువైన చరాస్తులు ఉన్నాయి. ఇందులో బంగారం విలువ రూ.35లక్షల వరకు ఉంటుంది. చేతిలో రూ.2లక్షల నగదు ఉంది. రూ.5కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. 60 తులాలు బంగారం ఉంది.

సతీష్‌మాదిగ
అచ్చంపేట బీజేపీ అభ్యర్థి

బీజేపీ అచ్చంపేట అభ్యర్థి సతీష్‌మాదిగకు రూ.10.10లక్షలు, ఆయన భార్య సుగుణ పేరుపై రూ.3లక్షల విలువజేసే చరాస్తులు ఉన్నాయి.

తూడి మేఘారెడ్డి
వనపర్తి కాంగ్రెస్ అభ్యర్థి

కాంగ్రెస్ వనపర్తి అభ్యర్థి తూడి మేఘారెడ్డి మొత్తం ఆస్తులు విలువ రూ.10.90 కోట్లు కాగా.. అందులో రూ.2.37కోట్ల విలువైన చరాస్తులు, రూ.8.53కోట్ల విలువజేసే స్థిరాస్తులు ఉన్నాయి. రూ.1.41కోట్ల అప్పు ఉంది. ఆయన భార్య తూడి శారద పేరుపై రూ.7.24 కోట్ల విలువైన చర, స్థిరాస్తులు ఉన్నాయి. రూ. 1.98 కోట్ల అప్పు ఉంది.

అనూజ్ఞరెడ్డి-వనపర్తి బీజేపీ అభ్యర్థి

బీజేపీ వనపర్తి అభ్యర్థి అనూజ్ఞరెడ్డికి రూ. 2.37 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. రూ.1.18 కోట్ల చరాస్తులు కాగా, రూ.1.20కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రూ.93లక్షల అప్పు ఉంది. స్వాతిరెడ్డి పేరుపై రూ.11.08లక్షల విలువజేసే చరాస్తులు ఉన్నాయి.

ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులు చేపట్టాలి

- సీఈసీకి కొల్లాపూర్ వాసి లేఖ

కొల్లాపూర్: ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులు చేపట్టాలని కోరుతూ భారత ఎన్నికల సంఘం ప్రధాన అధికారికి కొల్లాపూర్ మండలం ఎల్లూరుకు చెందిన బండి వెంకటరెడ్డి లేఖ రాశారు. శుక్రవారం ఆ లేఖను పోస్టు ద్వారా పంపించారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీచేసే వారికి కనీస విద్యార్హత 10వ తరగతిగా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్, డీసీసీబీ అధ్యక్ష ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే విధానం ఎత్తివేయాలని లేఖలో కోరారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా రెండు పర్యాయాలు గెలిచిన వ్యక్తులకే ఎమ్మెల్యే, ఎంపీ, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ పదవులకు పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలకు పెన్షన్ సౌకర్యాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు.

అట్టహాసంగా హ్యాండ్‌బాల్ టోర్నీ ప్రారంభం



మాట్లాడుతున్న హెచ్‌ఏఐ సెక్రెటరీ జనరల్ జగన్‌మోహన్‌రావు

- తొలిరోజు శుభారంభం చేసిన పాలమూరు జట్లు
- జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి
- హెచ్‌ఏఐ సెక్రెటరీ జనరల్ జగన్‌మోహన్‌రావు



తలపడుతున్న మహబూబ్‌నగర్-రంగారెడ్డి జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం అట్టహాసంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ ప్రారంభమైంది. ఈ పోటీల్లో తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాల బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. రెండు కోర్టుల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. చాలా రోజుల తర్వాత మెయిన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి క్రీడాకారులతో సందడిగా మారింది.

శుభారంభం చేసిన పాలమూరు జట్లు...

ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య పాలమూరు ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు శుభారంభం చేశాయి. జిల్లా బాలుర జట్టు తన మొదటి మ్యాచ్‌లో 16–5 గోల్స్ తేడాతో రంగారెడ్డి జట్టుపై విజయం సాధించింది. పాలమూరు బాలికల జట్టు 12–3 గోల్స్ తేడాతో హైదరాబాద్ జట్టుపై గెలుపొందింది. బాలుర విభాగం మ్యాచ్‌లో ఖమ్మం జట్టు 16–8 గోల్స్ తేడాతో హైదరాబాద్ జట్టుపై, కరీంనగర్ జట్టు 24–11 గోల్స్ తేడాతో నిజామాబాద్‌పై గెలుపొందాయి.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి..

జిల్లా క్రీడాకారులు హ్యాండ్‌బాల్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు అన్నారు. టోర్నీ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవితంలో ఓడిపోయినా.. దానిని మళ్లీ ఎలా నిలబెట్టుకోవాలో నేర్పించేది క్రీడలేనని అన్నారు. హ్యాండ్‌బాల్ క్రీడకు నేడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. తెలంగాణలో హ్యాండ్‌బాల్‌లో ఎక్కువ మంది చాలా మంది ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. పోలీస్, రైల్వే, పోస్టల్‌శాఖల్లో హ్యాండ్‌బాల్ క్రీడాకారులు ఉద్యోగం సాధించారన్నారు. మూడు నేషనల్స్ ఆడి, ఒక ఇంటర్నేషనల్ ఆడితే కచ్చితంగా ఉద్యోగం వస్తుందన్నారు. పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ.. ఇక్కడి నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారుడి నుంచి వీసీ అయినట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడలకు సమప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇలాంటి టోర్నీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతేడాది పాలమూరు యూనివర్సిటీలో హ్యాండ్‌బాల్ క్రీడను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పీయూలో అన్ని విధాల క్రీడా కోర్టులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ నెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు విక్రం ఆదిత్యరెడ్డి, అండర్-19 జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ రహెమాన్, ఎండీ జియావుద్దీన్, రాష్ట్ర పరిశీలకులు జగన్‌మోహన్‌గౌడ్, రఫత్ ఉమర్‌తో పాటు తెలంగాణ హ్యాండ్‌బాల్ సెలక్షన్స్ కమిటీ చైర్మన్ విష్ణువర్ధన్‌తో పాటు బాల్‌రాజు, రాంమోహన్, అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు మరో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది. ఇప్పటికే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ కొనసాగుతుండగా.. శనివారం నుంచి ఈ నెల 13 వరకు ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ జరగనుంది. 2019 అనంతరం జిల్లాకేంద్రంలో రెండోసారి అండర్-19 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. బాలురకు మెయిన్ స్టేడియంలో, బాలికలకు పాలమూరు యూనివర్సిటీలో పోటీలు జరగనున్నాయి.

240 మంది క్రీడాకారులు..

ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, మెదక్, నల్గొండకు చెందిన బాల బాలికల జట్లు పాల్గొంటున్నాయి. మొత్తం 240 మంది క్రీడాకారులు, 40 మంది అఫీషియల్స్ హాజరుకానున్నారు. బాలురుకు లిటిల్ స్కాలర్స్ పాఠశాలలు, బాలికలకు పాలమూరు యూనివర్సిటీలో వసతి కల్పించారు. రెండు గ్రూప్‌లుగా విభజించి లీగ్ కం నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ రెండు విభాగాల సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు స్టేడియంలో నిర్వహిస్తారు. మెయిన్ స్టేడియంలో ఉదయం, సాయంత్రం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు జరగనున్నాయి. టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లకు మెయిన్ స్టేడియంలో కోచ్ ఖలీల్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.



ప్రాక్టీస్ చేస్తున్న ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

- **ఉమ్మడి జిల్లా బాలుర జట్టు:** అదిత్ నారాయణ, టి.వివేక్, సయ్యద్ ఉజేర్ అబ్దుల్లా, అబ్దుల్ ఖాదర్, మహ్మద్ అబ్దుల్ రఫీ, గులాం మహ్మద్ జిలానీ, భానుప్రకాశ్, చరణ్‌కుమార్, విశ్వక్‌రెడ్డి, శ్రీకాంత్, రాజు, నవీన్.
- **బాలికల జట్టు:** శ్రీలత, వరలక్ష్మిరెడ్డి, బి.నందిని, వసంత, మంజుల, అంజలి, స్వప్న, మాధవి, సి.వనజ, వైష్ణవి, సి.కమలావతి, శాంతికుమారి.

భర్తను హతమార్చిన భార్య

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే..
- అదృశ్యంగా చిత్రీకరించి పోలీసులకు ఫిర్యాదు
- మహమ్మదాబాద్ శివారు అటవీ ప్రాంతంలో మృతదేహం లభ్యం

హన్వాడ/మహమ్మదాబాద్: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను ప్రియుడితో కలిసి భార్య హతమార్చిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొనగట్టుపల్లికి చెందిన ఇప్పలి అంజిలయ్య (45) అయిదు రోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడని భార్య ఇప్పలి లక్ష్మమ్మ ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు అతడి ఆచూకీ కోసం అన్ని ఠాణాలకు సమాచారం పంపించారు. ఈ క్రమంలోనే పక్కనే ఉన్న మహమ్మదాబాద్ శివారులోని ధర్మాపూర్ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురైనట్లు సమాచారం అందడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పరిశీలించి ఇప్పలి అంజిలయ్యగా గుర్తించారు. వెంటనే పోలీసులు భార్య ఇప్పలి లక్ష్మమ్మను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా ప్రియుడు, మరో వ్యక్తి సహకారంతో తానే హత్య చేసినట్లు వెల్లడించింది. హత్యచేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. అంజిలయ్యకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఇప్పలి అంజిలయ్య (ఫైల్)

పరిచయం కాస్త ప్రేమగా..

అంజిలయ్య భార్య లక్ష్మమ్మ పాలమూరుకు అడ్డా కూలీగా వెళ్లేది. ఈమెకు బోర్లు మరమ్మతు చేసే నవాబ్‌పేట మండలం మరికల్‌కు చెందిన జోగు శ్రీను పరిచయమయ్యాడు. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. రెండేళ్లుగా సాగుతున్న వీరి వ్యవహారానికి భర్త అడ్డంకిగా మారడంతో హతమార్చేందుకు లక్ష్మమ్మ ప్రియుడితో కలిసి పథకం వేసింది. ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అంజిలయ్యను అనుసరించిన జోగు శ్రీను, అతడితో హెల్పర్‌గా పనిచేసే బాలయ్య మహమ్మదాబాద్ శివారులోని ధర్మాపూర్ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా తిరిగి పోలీసులకు భర్త కనిపించడం లేదని లక్ష్మమ్మ ఫిర్యాదు చేసింది.

జూరాలకు 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 78 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,044 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.462 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

కృష్ణా: నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును శుక్రవారం డీఐజీ ధ్రువ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వివరాల తోపాటు వాహనాల తనిఖీలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక నుంచి డబ్బులు, మాదక ద్రవ్యాలు సరఫరా కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. డీఐజీ వెంట ఎస్పీ యోగేష్ గౌతమ్, సీఐ రాంలాల్, ఎస్‌ఐ విజయభాస్కర్ ఉన్నారు.



కృష్ణా చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీఐజీ ధ్రువ్

నగదు పట్టివేత

నారాయణపేట రూరల్: జిల్లావ్యాప్తంగా ఆయా చెక్‌పోస్టుల వద్ద శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.9,90,500 నగదు పట్టుబడినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. కృష్ణా పీఎస్ పరిధిలో రూ.5లక్షల 50వేలు, మక్తల్ పీఎస్‌లో రూ.95వేలు, నారాయణపేట పీఎస్ పరిధిలో రూ.3లక్షల 44వేల నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు వెల్లడించారు.

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో రూ.లక్ష 50వేల నగదు లభ్యమైనట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. మక్తల్ మండలం కర్నికి చెందిన మంగళి నర్సింహులు రాయచూరు నుంచి నగదు తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

మీనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి చెక్‌పోస్టు వద్ద అజ్జకొల్లుకు చెందిన రాజు అనే వ్యక్తి నుంచి రూ.73,500 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రవిప్రకాష్ తెలిపారు.

ఆరోగ్య ధన ప్రాప్తిరస్తు!



ఇవాళ ధనత్రయోదశి. దీనినే ధన్ తేరస్ అని కూడా అంటారు. ఈ పర్వదినాన సాధారణంగా అందరికీ బంగారం, వెండి, గృహోపకరణాలు, వస్తు వాహనాల వంటి వాటి మీదికే దృష్టి మళ్లుతుంది. ఆరోగ్య ప్రదాత అయిన ధన్వంతరి జయంతి కూడా ఇదే రోజు అని గుర్తు రాదు. అయితే ఆరోగ్యం కూడా ధనమే కాబట్టి ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏం చేయాలో తెలుసుకుని అందుకు తగినట్లు నడుచుకుంటే ఆరోగ్య ధనం, ఆరోగ్య మహాభాగ్యం సమకూరుతుంది. ధనత్రయోదశి సందర్భంగా ఆరోగ్య సంపదను ఏవిధంగా పెంపొందించుకోవాలో చూద్దాం...

సంపూర్ణ ఆరోగ్యానికి ఆహార విహారాలు ఎంత అవసరమో, నిత్యం నడక, వ్యాయామం, యోగా కూడా అంతే అవసరం. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు. అజీర్తి నుంచి ఆర్థరైటిస్ వరకు.. బీపీ నుంచి హార్ట్‌టాక్ వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్య వరకు ఏదైనా నయం కావాలంటే రోజూ వ్యాయామం, యోగా చేస్తుండాలి.

సమయానికి తగు...



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఎంత అవసరమో ఆ ఆహారాన్ని తగిన సమయానికి తీసుకోవడం కూడా అంతే అవసరం. వేళ తప్పి భోజనం చేస్తే అది మన ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. అందువల్ల ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సరైన సమయాలకు భోజనం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

బ్రేక్ ఫాస్ట్ తప్పనిసరి

రోజూ ఉదయాన్నే టిఫిన్ చేయడం వల్ల ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండగలుగుతారు. కొందరికి అలా బ్రేక్ ఫాస్ట్ చేయడం అలవాటు ఉండదు. అలాంటి వారు అల్పాహారంగా నానబెట్టిన బాదం, ఎండు ద్రాక్ష, వాల్నట్స్, మొలకెత్తిన గింజలు, అవిసెలు, తాజాపండ్లు, కూరగాయల ముక్కలు లాంటివి అయినా తప్పనిసరిగా తీసుకోవాలి.



లంచ్‌గా ఇవి...

మధ్యాహ్నపు భోజనంగా సగం కంచంలో తాజా కూరగాయలు, మిగతా సగంలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి.



రక్తంలో చక్కెర నిల్వల్ని అదుపులో ఉంచుకోవడానికి, లో గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు లాంటి చిరుధాన్యాన్ని ప్రయత్నించవచ్చు.

ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి. ఎందుకంటే, మనం వాడే ప్లాస్టిక్ వస్తువుల నుండి, రోజుకి కొన్ని లక్షల సూక్ష్మరేణువులు విడుదలవుతాయి. వాటిలో ఉండే రసాయనం హార్మోన్ల సమతౌల్యాన్ని దెబ్బ తీస్తుంది.

మానసిక దృఢత్వం

మానసిక ఆరోగ్యం బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు. ఇందుకోసం నిత్యం నడక, వ్యాయామం, యోగా తప్పనిసరి. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు.

కంటినిండా నిద్ర

కడుపు నిండా తిని కంటి నిండా నిద్ర పోతే ఏ జబ్బూ ఉండదని పెద్దవాళ్లనేవారు. వేళకు తగినంత రాత్రి నిద్ర ఉంటే పొద్దున లేవగానే ఉత్సాహంగా ఉంటుంది. లేదంటే నిస్సత్తువగా... ఏదో పోగొట్టుకున్నట్లుగా అనిపిస్తుంది. నిద్ర లేమి వల్ల రకరకాల ఇతర జబ్బులు వస్తాయి. అందువల్ల వీలయినంత వరకు వయసును బట్టి, చేసే శారీరక శ్రమను అనుసరించి తగినంత నిద్ర పోవడం ప్రతి ఒక్కరికీ అవసరం.



ఈ ధన త్రయోదశి నాడు అందరూ ఆరోగ్య ధనాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తారని, వేయాలనీ ఆశిద్దాం.

మంచి కొవ్వు మంచిదే!



లావవుతామనే భయంతో చాలామంది కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాలను తినడం మానేస్తున్నారు. కొందరైతే నెయ్యి తినడం ఎప్పుడో మానేశారు. అయితే శరీరంలోని ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వులో మాత్రమే కరుగుతాయి. కాబట్టి తగిన పరిమాణంలో మంచి కొలెస్ట్రాల్ ఎంతో అవసరం. అలాగని అన్నిరకాల కొవ్వులూ ఆరోగ్యం కాదు. ఇంతకూ ఆరోగ్యకరమైన కొవ్వు లభించాలంటే ఎలాంటి ఆహారాలు తీసుకోవాలో తెలుసుకుందామా?

మీరు ఆరోగ్యం పట్ల చాలా కాన్షియస్‌గా ఉండి..అధిక పరిమాణంలో కొలెస్ట్రాల్ ఉన్న ఆహారాలకు దూరంగా ఉంటే తప్పకుండా ఈ అవకాడోను ఆహారంలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఆలివ్ ఆయిల్: వేపుళ్లకు దూరంగా ఉండేవారు తప్పకుండా ఆహారాల్లో ఆలివ్ ఆయిల్‌ను తప్పకుండా వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు, మోనోశాచురేటెడ్ కొవ్వులు గుండెను ఆరోగ్యంగా చేసేందుకు సహాయపడతాయి. అంతేకాకుండా శరీర బరువును నియంత్రించేందుకు కూడా సహాయపడతాయి.

పెరుగు: బరువు తగ్గడానికి ఆరోగ్యకరమైన ఆహారాలు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా తీసుకుంటే శరీరంలోని కొవ్వును సమతుల్యంగా చేస్తుంది. కాబట్టి శరీరం ఆరోగ్యంగా ఉండడానికి తప్పకుండా కొవ్వు పాలతో చేసిన పెరుగు తినడం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే గుణాలు ప్రేగును కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి.

కొబ్బరి: కొబ్బరి లేదా కొబ్బరి నూనె తీసుకోవడం వల్ల శరీరానికి అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో జీర్ణక్రియను మెరుగుపరిచే చాలా రకాల పోషకాలు దొరుకుతాయి. దీనివల్ల ట్రైగ్లిజరైడ్ ఫుడ్ సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాకుండా మలబద్ధకం, ఇతర పొట్ట సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.

చేపలు: చేపలలో మంచి కొలెస్టరాల్‌ను పెంపొందించే లక్షణాలున్నాయి. అందుకే ఇతర విధాలైన మాంసాహారాలకు దూరంగా ఉండమని హెచ్చరించే వైద్యులు సైతం పరిమితంగా అయినా చేపలు తీసుకోవచ్చునని చెబుతారు.

బాదం పప్పు, జీడిపప్పు: వీటిని తీసుకోవడం వల్ల కొవ్వు పెరుగుతుందని అనుకుంటాం. అయితే వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు మాత్రమే ఉంటాయి. అందువల్ల బాదం, జీడిపప్పు తీసుకోవడం మంచిది. బాదం పప్పును నీటిలో నానబెట్టి, పైన పొట్టు తీసి తినడం మంచిది. జీడిపప్పును అయితే వేయించకుండా నేరుగా తీసుకోవడం వల్ల మంచి కొలెస్టరాల్ పెంపొందుతుంది.

నెయ్యి: ఇదివరకటిలో ఆహారంలో నేతిని బాగా ఉపయోగించేవారు. అరిసెలు, గారెలు వంటి వాటిని నేతితోనే చేసేవారు. అయితే రానురానూ నెయ్యి తినడం ఆరోగ్యానికి మంచిది కాదనే అభిప్రాయం స్థిరపడిపోయింది. నిజానికి నేతిలో శరీరానికి అవసరమైన పోషకాలెన్నో ఉన్నాయి. అలాగని ముద్ద ముద్దకీ నెయ్యి వేసుకోవడం, నేతితోనే చేసిన డీప్ ఫ్రైలు విపరీతంగా తీసుకోవడం మాత్రం అంత మంచిది కాదు. గేదె నెయ్యి కన్నా ఆవు నెయ్యి మంచిది.

మరకలను మాయం చెయ్యండి ఇలా...

బట్టలపై మరకలు పడ్డప్పుడు డ్రై క్లీనింగ్‌కి ఇద్దామంటే ఆ ధరకు కొత్తదే వస్తుందమే అనిపిస్తుంది. అయితే మరకలను తొలగించుకునేందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేమిటో చూద్దాం.

మీ దుస్తులు మెరిసేలా చేయాలంటే ఆస్పిరిన్ మాత్రలు బాగా ఉపయోగపడతాయి. ఆస్పిరిన్‌లో ఉండే ఎసిటైల్‌సాలిసిలిక్ ఆమ్లం బట్టలపై పడిన మరకలను తొలగించేందుకు సాయం చేస్తుంది. తెల్లని దుస్తులను నాలుగైదు ఆస్పిరిన్ టాబ్లెట్లు వేసిన నీళ్ల బకెట్‌లో బాగా నానబెట్టండి. తరవాత బట్టల సబ్బుతో ఉతకడమో లేదా వాషింగ్ మెషీన్‌లో వేసి మామూలుగా ఉతికి జాడించి ఆరేస్తే సరి!

రక్తపు మరకలను తొలగించడానికి.. ఆస్పిరిన్‌ను చల్లటి నీటిలో కరిగించి బట్టలను నానబెట్టండి. వేడినీటితో రక్తపు మరకలను తొలగించడానికి ప్రయత్నించవద్దు. ఇది ప్రోటీన్లు గడ్డకట్టడానికి కారణమవుతుంది. ఆ తరువాత మరకను తొలగించడం కష్టం అవుతుంది. చేస్తుంది.



నూనె, గ్రీజు మరకలకు

ఒక నిమ్మకాయను రెండు ముక్కలుగా కోయాలి. ఒక ముక్క మీద ఉప్పు వేసి మరకపై రుద్దాలి. ఇది నిమిషాల్లో బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

వక్కపొడి, పాన్ మసాలా మరకలు

పెరుగు లేదా మజ్జిగను మరక పడ్డ చోట ఉంచి పది నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత శుభ్రమైన నీటితో వస్త్రాన్ని కడగాలి. ఇది బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

టీ-కాఫీ మరకలు

టీ-కాఫీ మరకలు పడ్డప్పుడు ముందుగా గోరువెచ్చటి నీటిలో ఆ వస్త్రాన్ని పదిహేను నిమిషాలు ఉంచిన తర్వాత లిక్విడ్ డిటర్జెంట్లో నానబెట్టాలి. తర్వాత మరక పడ్డ చోట చేతితో రుద్దితే మరకలు తొలగుతాయి.

టర్కీ టవళ్లు, దుప్పట్ల వంటి వాటిని బట్టలుతికే సోడా కలిపిన నీటిలో నానబెట్టి ఉతికితే త్వరగా శుభ్ర పడతాయి.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ-మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు ''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్



● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.

వేటాడే సత్యభామ



● కాజల్

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.

లింగి లింగిడి..!



● రాహుల్, శివానీ, మిథున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిథున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.

రెండు హృదయాల కల



● జాన్వీ కపూర్

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చూస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.

మాస్ రింగు...



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్



● 'ది ట్రయల్' పోస్టర్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్



''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.